
# ఎర్రమెతుకులు

తెనాలి సుశీలాదేవి



ఆఘమేఘాలమీద వస్తున్న దాదర్ ఎక్స్‌ప్రెస్ అల్లంతదూరాన తను ఆగవలసిన స్టేషన్ కనిపించి పరుగును నడకలోకి మార్చుకుంది.

దేదీప్యమానంగా లైట్లకాంతితో మెరిసిపోతూ చేరువవుతోంది స్టేషన్. అక్కడ రెండు నిముషాలే ఆగుతుందా బండి. పెద్దగా ఎక్కే, దిగే పాసింజర్లు లేకపోయినా కాలక్షేపానికి వచ్చిన కబుర్ల రాయుళ్ళతో కలకలలాడుతూ వుంటుంది.

స్టేషన్ కొన్ని గజాల దూరంలోకి వచ్చేసింది. ఆ కంపార్టుమెంటులో జనం ఏమంతగా లేరు. తలుపు దగ్గరగా దిగడానికి తయారుగా నుంచుని వున్నారు యిద్దరు. అతడు, ఆయన.

అప్పటిదాకా ఆ రైలుచక్రాలు తన గుండెలమీద పరుగెడుతున్నట్టుగా, ఆ రైలు భారమంతా తన తలమీద మోస్తున్నట్టుగా సతమతమవుతున్న అతడు ఒక్క క్షణం తనను తాను సిభ్బరించుకుంటున్నట్టుగా గుండెలమీద చెయ్యి వేసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. మరుక్షణం గాలిలోకి లేచిన ఆ చేయి....

కెవ్వున కేక రైలు కూతలో కలిసిపోయింది. క్షణాల్లో ప్లాట్‌ఫారంమీదకు వచ్చి ఆగింది ఎక్స్‌ప్రెస్. బిలబిలలాడుతూ జనం.... రైలు దిగినవాళ్ళూ, స్టేషన్‌లో వుండినవాళ్ళూ ప్లాటుఫారం చివరకు పరుగులు తీశారు.

* * *

'తనుదూర కంతలేదు, మెడకొక డోలట'.

లోపలినుండి వినవచ్చిన ఆ మాటలకు చివ్వున లేచి కూర్చున్నాడు అప్పటిదాకా అటూ యిటూ మంచంమీద దొర్లాడుతున్న శ్రీనివాసు.

ఆ మాటలంటున్నది ఎవరో కాదు.... సాక్షాత్తు పిల్లనిచ్చిన మామ, అదివరకు మేనమామ.

'ఆ విషయం చెప్పినట్టుంది సుజాత. అందుకే ఆ మాట వచ్చివుంటుంది' అవమాన భారంతో క్రుంగిపోయాడు.

ఈ వ్యంగాలు, విసుర్లు, హేళనలు, నిరసనలు అలవాటుపడినవే అయినా 'యిక్క నకూడా'....

ఈ మాటలంటున్న యీ మామగారే రెండేళ్ళక్రితం....

'నీ కేమోయ్. ఎమ్.కామ్. పాసయ్యావు. వుద్యోగం నిన్ను వెతుక్కుంటూ రాదూ. బాబ్బాబూ నీ యిష్టమన్నాడు మీ నాన్న. ఒప్పేసుకో. పెళ్ళయిపోతే వుద్యోగం దానంతటదే వస్తుంది. వెంటవెంటనే ఆడపిల్లలు లేకుంటే నిన్నిలా తొందరపెట్టి వుండను. పెద్దదాని పెళ్ళయిపోతే మరోతి తయారయ్యేసరికి కాస్త వూపిరి పీల్చుకోగలను. ఈ మేనమామను కాస్త కనికరించవోయ్ అల్లుడూ.' అప్పుడలా చేతులు పట్టుకొని ప్రతిమాలిన మేనమామ, యిప్పుడు.... యిప్పుడు చాటుమాటుగా.... యీ చెల్లాంటి మాటలతో.... అప్పుడాయనలా తన మెడకో డోలు తగిలించాడు. ఇప్పుడు తాను... ఛీ....ఛీ అనుకుంటూ ఒక్క వుదుటున మంచందిగాడు.

తాంబూలం పట్టుకుని గదిలోకి వచ్చిన సుజాత అతడిని చూసి ఆశ్చర్యపోయింది. క్షణంసేపు ఏంతోచనిదానిలా నిలబడిపోయింది. బట్టలు వేసుకుని తయారయిపోయి విప్పిన లుంగీని బ్యాగులో కుక్కుతున్నాడతను.

"ఎక్కడికయినా వెడుతున్నారా" నెమ్మదిగా అడిగింది సుజాత.

"ఊ.... నేను యిప్పుడు బండికి

వూరెళ్ళిపోతున్నాను. నీ పీలునిబట్టి తర్వాత నీవు...."

"అదేం? వచ్చి గంటయినా కాలేదు. అప్పుడే ప్రయాణమా?"

"ప్రశ్నలు వేసి నన్ను విసిగించకు సుజాతా. నీకు పుణ్యముంటుంది." విసుగ్గా అన్నాడు శ్రీనివాస్.

'ఇందాక నాన్న మాటలు వినిపించి వుంటాయి.' అనుకుంది సుజాత. బాధ పడింది. ఎవరికి చెబుతుంది?

తనకు నెలతప్పిందని అమ్మతో అంటూంటే నాన్న విన్నాడు. అప్పుడే సరిగ్గా అల్లుడి గురించి నిరసనగా మాట్లాడాడు. తనుదూర సందులేదు ... యీ మాట విన్నాక ఎవరికయినా కోపం వస్తుంది. పెళ్ళంటూ చేశాడు. వుద్యోగం లేదుకదాని పెళ్ళాన్ని పక్కలో పెట్టుకుని కాపురమూ [illegible]కుంటారా? ఈ పరిస్థితుల్లో పిల్లలు తయారవటం భారమే కాని యిది.... యిది తమకు తొలిపంట.

కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి సుజాతకు బ్యాగు పట్టుకుని గడపదాటబోతూ సుజాత ముఖంలోకి క్షణం చూశాడు. ఆ కళ్ళల్లో నీళ్ళచూసి చివుక్కుమందతనికి. కాని.... కాని.... ఊహూ.... తల విదిలించుకుని "మీ అమ్మానాన్నతో చెప్పు, నేను వెళ్ళిపోయానని" అంటూ రెండంగల్లో గుమ్మందాటి వీధిలోకి వచ్చాడు.

నీళ్ళనిండిన మసకకళ్ళతో తననే చూస్తూ వుంటుందని అతడికి తెలుసు. 'సుజాతని తనతో తీసుకొచ్చేసివుంటే బావుండేదేమో.' ఒక నిముషం కొట్టుకులాడింది శ్రీనివాస్ మనసు. మరు నిముషంలోనే వర్తమానం అతడ్ని భయపెట్టింది. అవహేళన చేసింది.

"ఏం బాగు?" ఇంట్లో సుజాతకు ఏ మాత్రం విలువుందో తనకు తెలుసు. సూటిపోటి మాటలు ఛీత్కారాలు, కలిసిరాని వేళమీద, కోడలు తేలేని అదృష్టం మీద విసుర్లు....

నాన్న అంటున్నారంటే ఒక రకం. కానీ కడుపులో పెట్టుకొని కాచుకోవలసిన మేనత్తయిన అమ్మకూడా సుజాతను..?

కొడుకే గడ్డిపోచకన్నా హీనంగా చూడబడుతూంటే, కోడలో లెక్క....? కందిరీగల్లా ముసురుతున్న ఆలోచనలని పక్కకు నెట్టవలసివచ్చింది బయలుదేరబోతున్న రైలుకూత విని.

పరుగుపెట్టి నాలుగంగల్లో బండి చేరుకుని కదులుతున్న రైలుని ఎక్కాడు శ్రీనివాస్.

"మీ మామ ఏమన్నాడు."

యింటికి రాగానే తండ్రి ప్రశ్న చిరాకు కలిగించింది శ్రీనివాస్‌కి.

"ఏం అనలేదు" అన్నాడు మెల్లిగా. మామ మాటలు కందిరీగల్లా కుడుతున్నాయి.

"ఎక్కడన్నా వుద్యోగ ప్రయత్నం చేస్తాడంటనా" కుర్చీలో వెనక్కివాలుతూ అడిగాడాయన.

"నే నడగలేదు" విసుగు దాచుకుంటూ అన్నాడు.

"ఏం?"

'ఏం'? అన్న ఆ ఒక్క అక్షరంలో ఎంతో వ్యంగ్యం, హేళన ధ్వనించినట్టయింది శ్రీనివాస్‌కు.

"అడగాలనిపించలేదు."

బ్యాగు అక్కడ పారేసి పెరట్లోకి వెళ్ళాడు. వెనుకనే సూటిగా వచ్చి తగిలాయి యీ మాటలు.

"బోడి ప్రిస్టేజి అడ్డంవచ్చింది కాబోలు."

కాళ్ళు కడుక్కొని, నీళ్ళారిన కళ్ళను కడుక్కొని వచ్చేసరికి కంచంలో భోజనం వడ్డించిన అమ్మ కనిపించింది శ్రీనివాస్‌కు.

కోడలు అదృష్టానికి వంకలు పెడుతుందిగానీ కొడుకునేం అనలేని కన్నతల్లి ఆమె.

"మామయ్య నేమయినా అడిగి చూశావురా" ఆప్యాయంగా అంది.

నాన్న వేసిన ప్రశ్న యిది. కాని పదాలు వేరు. అడిగిన తీరు వేరు.

"అడక్కుండానే చాటుగా చాలా వడ్డించేశాడు" అనబోయి ఆ కోపం తనలోనే కుక్కుకుని మాట్లాడకుండా తింటూండిపోయాడు. ఇక మళ్ళీ అడగలేకపోయిందా తల్లి.

* * *

ఆరోజు సుజాత దగ్గరనుండి వుత్తరం వచ్చింది తను బయలుదేరి వస్తున్నట్టు. తను స్టేషన్‌కు పోలేదు. యింటర్‌వ్యూ వుంది కలెక్టరాఫీసులో.

"ఈసారయినా బాగా చేసిరా నాయనా" అంది తల్లి.

"అంటే యింతవరకు తను వెళ్ళినవి బాగా చేయకనే రాలేదా.... ఛీ ఛీ.... తన మనసెందుకిలా ఎప్పుడూ పెడర్థంగానే ఆలోచిస్తుంది" అనుకున్న "అలాగేనమ్మా" అతి ప్రయత్నంమీద నెమ్మదిగా అని బయలుదేరాడు శ్రీనివాస్.

సాయంత్రం....

దీపాలు పెట్టేవేళకు ముఖం వేలాడేసుకుని యింట్లో అడుగుపెట్టేడు. వంటింటి గుమ్మంలో సుజాత కనిపించి ఒక్కక్షణం మెరిశాయి అతని కళ్ళు. పెరట్లోంచి తండ్రి రావటం కనిపించింది. శ్రీనివాస్ హృదయం బాధగా మూలిగింది.

"ఏరా! యింటర్‌వ్యూ ఎలావుంది?"

"బాగానే వుంది. అయినా, యీ వుద్యోగం మాత్రం రాదు."

"ఎందుకనో...."

"నాకు సిఫారసులు లేవు గనుక"

"అందరికీ సిఫారసులుంటేనేనా వుద్యోగాలొచ్చేది."

"మాటలున్నా వస్తాయి." పెడసరంగా అన్నాడు శ్రీనివాస్ యీమారు.

"మీ మామనడిగి ఒక మాట తెచ్చుకోలేకపోయావూ."

చివ్వున తలెత్తి చురుగ్గా చూశాడు శ్రీనివాస్. తండ్రి కళ్ళలో, ఆ వంకర నవ్వులో ఎంత అవహేళన?


"షూ. మిటకరించి చూడటం మాత్రం చేతవును. చచ్చిచెడీ నిన్ను డిగ్రీ చదివించాను, చెయ్యి సాయం అందిస్తావని. నీవేమో ఎక్కడవేసిన గొంగళీ అంటే వేసినచోటే అన్నట్టున్నావు. యీ మిగతా పిల్లలు ఎట్లా వృద్ధిలోకి వస్తారో ఏమో ,"

"నన్నేం చేయమంటారు? ఉద్యోగాలు ఎలా దొరుకుతున్నాయో మీకు తెలియదా? యీ యింటర్వ్యూలు కంటి నీటి తుడుపులకేనని తెలిసిపోతోంది. మనల్ని రికమండ్ చేసేవాళ్ల లేరు. లంచం యిచ్చేంత లక్ష్మి మనదగ్గర లేదు. నన్నేం చావమంటారా?"

"అయ్యో! అవేం మాటలురా శీనూ." క్షణమాత్రంలో తల్లి కంఠం గద్గదమయింది. పమిటచెంగుతో కళ్ల తుడుచుకుంటూ లోపలికి వెళ్లిపోయింది సుజాత. తల్లి ఎంత బ్రతిమిలాడినా భోజనం చేయకుండా పడుకున్నాడు శ్రీనివాస్. సుజాత ఎప్పుడొచ్చి పడుకుందో తెలీదు.

మినుకుమినుకు మంటున్న ఆశతో వుదయం పదిగంటలకు యింటర్వ్యూ జరిగిన ఆఫీసుకు వెళ్లాడు. అకాస్తమినుకు చప్పచల్లారిపోయింది. తన పేరు లేనపుడు ఏ పేరయితేనేం....

ఇంటికెళ్లాలంటే అదోలావుంది శ్రీనివాస్‌కి తండ్రిమాటలు తలుచుకుంటూంటే తేళ్లూ, జెర్రులు ప్రాకినట్టుంది. ఆయనకి తోచదా చెట్టంత కొడుకుని అంతలేసి మాటలనకూడదని. ఆయనకి యీ వుద్యోగాల వేటగురించి తెలియకనా, లేక యీ బరువు బాధ్యతలు మోసేందుకు మరో సాయంలేకా? కాక విసిగిపోయి వున్నందున అలా మాట్లాడతారా? పరిస్థితుల యిరకాటాల మధ్య ఆత్మీయత నలిగి కరిగిపోతుందా....




"ఒరేయ్ శీనూ...."

ఎవరో పిలిచారు. చప్పున వెనక్కి తిరిగాడు శేషు....

ఒకప్పుడు తనలాగే వున్నాడు. కాని యిప్పుడు అలా లేడే....

జీవంలేనట్టుగా నవ్వి చేయివూపాడు శీను.

"చాలా రోజులయింది కదూ మనం కలిసి" శేషు అన్నాడు. ఏదో మెరుపు వుత్సాహం కనబడుతోంది శేషుముఖంలో శీనుకి.

"అయితే నీకింకా వుద్యోగం దొరకలేదా...." భుజంమీద చరుస్తూ అన్నాడు శేషు.

"అంటే నీకు దొరికిందా ఏమిటి" ఆత్రుతగా అడిగాడు శ్రీనివాస్.

"అవును" మెల్లగా అన్నాడు శేషు. అతడి ముఖంలో మెరుపు తగ్గినట్టు అనిపించింది శ్రీనివాస్‌కి.

"ఎక్కడ....?"

"శీనూ!" అంటూ స్నేహితుడి భుజంమీద చెయ్యివేసి అదిమిపట్టాడు శేషు. శేషు కళ్లల్లో తడి, పెదిమల బిగింపు మాటున నొక్కిపెడుతున్న దుఃఖం గమనించి ఆశ్చర్యపోయాడు శ్రీనివాస్.

"ఏమిట్రా శేషూ...." తన భుజం మీదున్న శేషు చేతిని ఆప్యాయంగా నొక్కాడు.

"నిజం....?" నమ్మలేనట్టుగా అడిగాడు శ్రీనివాస్.

"ఆ.... హార్ట్ ఎటాక్.... ఆయన పనిచేస్తున్న ఆసుపీసులోనే వుద్యోగం యిచ్చారు నాకు. క్వాలిఫికేషన్స్ వుండటం మూలాన రెణ్ణెల్లు తిరక్కుండానే ఆర్డర్సు చేతికివచ్చాయి. నాన్న పోయినందుకు ఏడవాలో, మరీచికలా యిన్నేళ్లు వేధించి వుద్యోగం అరిచేతుల్లో వచ్చిపడినందుకు సంతోషించాలో తెలీటంలేదు. నేను వుద్యోగస్తుడిని కావాలని తపించిపోయారు ఆయన. ఆయన పోతేతప్ప రాని యీ వుద్యోగం నాకు ఆనందదాయకంగా లేదురా శీనూ...." బరువుగా అన్నాడు శేషు.

"ఛ....ఛ.... వూరుకో. అంతలా బాధపడకు. ఏంచేస్తాం ఎప్పుడో ఓసారి ముందూ వెనుకగా అందరూ పోవలసిన వారే...."

"అదికాదురా.... మా నాన్న నాలో నిరాశను, నిస్పృహను పోగొట్టాలని, అణగారిపోతున్న ఆశలకు వూపిరులు

పూడటానికి ఎంత ప్రయాస పడేవాడో. తెలుసా. ఎప్పటికప్పుడు యీ పుద్యోగాల వేటలో అలసిపోయి, ఓడిపోయి యింటికివస్తే తనూ నాతో సమంగా, యింకా చెప్పాలంటే నాకన్నా ఎక్కువగానే మథనపడినా, పైకి మాత్రం నాకెంతో ధైర్యాన్ని, ఓదార్పును యిచ్చేవారు. అదే లేకపోతే విరక్తితో ఎప్పుడో ఆత్మహత్య చేసుకునేవాడిని. చివరకు ఏమన్నారో తెలుసా. 'శేషూ నా కింకా రెండున్నర సంవత్సరం సర్వీసుఉందిరా. నీకు మాత్రం యింకో యేడాదిలో పుద్యోగం దొరికి తీరాలి. లేకుంటేవయసు మీరిపోతుంది. ఈ ఏడాదిలో నీ కెక్కడా దొరక్కపోతే నేను.... నేను వాలంటరీ రిటైర్మెంటు తీసుకుంటానురా. నీ కోసం.... నీకు అప్పుడు నా బదులుగా పుద్యోగం యిస్తారు. సరేనా' అంటూ బుజ్జగించారు. అట్లా అయినా జరిగింది కాదు. ఆ సంవత్సరం గడువూ ఆలశ్యమే ననుకున్నారేమో. శాశ్వతంగా పుద్యోగంనుంచే కాదు యీ బరువుల నుంచి, బంధనాలనుంచి రిటైర్ అయి వెళ్లిపోయారు...."

తన భుజాలమీద తలవాల్చి ఏళ్ళద్దింగా ఏడుస్తున్న శేషుని ఎలా ఓదార్చాలో తెలీలేదు శ్రీనివాస్కు.

"పూరుకో.... శేషూ.... పూరుకో.... ఏమిటీ.... పసివాడిలా...."

"ఏడవనీ శీనూ నన్ను. యీ భారం మోయలేకుండా వున్నాను...." పూడుకుపోతున్న కంఠం పెగల్చుకుని అన్నాడు శేషు.

"సరెసరెలే. అంతా పిచ్చి.... ఎలా జరగాలనివుంటే అలాజరుగుతుంది. మన చేతుల్లో ఏంలేదు " శుష్కవేదాంతం తన నోట్లో వస్తుంటే నిర్లక్ష్యంగా పెదవి విరిచాడు శ్రీనివాస్.

"నా ఆవేదన నీకు తెలియటంలేదు శీనూ. నా కంత ధైర్యాన్ని నూరిపోస్తూ వచ్చారేగానీ ఆయన లోలోపలే కృంగిపోతూ వచ్చారు బాగా. ఎదిగిన కొడుకు, చదువుకున్నవాడు 'పుద్యోగం' 'పుద్యోగం'అంటూ పిచ్చికుక్కలా తిరుగుతూ, కాళ్ళీడ్చుకుంటూ, ముఖం వేలాడేసుకుని నిరాశా, నిస్పృహలతో అలమటించిపోతుంటే ఆయన తల్లడిల్లిపోయారురా. ఆయనలా అమాంతం వెళ్లిపోకుండా ఏ పెరాలసిస్లాంటి జబ్బో వచ్చివుంటే మంచంలో వుండిపోయినా ఆయనకు బదులు నాకు యీ పుద్యోగం యిచ్చివుండేవాళ్లు. కనీసం తను కోరుకున్న పుద్యోగస్తుడి కళ తన కొడుకుముఖంలో చూసుకుంటూనయినా వుండేవారు. అలా అయినా కాకుండా.... యిలా అర్థాంతరంగా.... అదే.... అదేరా నాబాధ...."

"అంతా నీ వెర్రిగాని శేషూ....అన్నీ మనకి చెప్పి, మనకు ఏది అనుకూలమో అడిగి వస్తాయా ఏమిటి? అన్నింటిని భరించడమే మన విధి. మీ నాన్నగారు పోయినందుకు కండొలెన్స్. నీవు పుద్యోగస్తుడి వయినందుకు కంగ్రాచ్యులేషన్స్ కలిపి చెబుతున్నాను నీకు...." చేయి అందించాడు శ్రీనివాస్.

ఆప్యాయంగా ఆ చేతిని అందుకుని నొక్కి.... కర్చీఫుతో కళ్లు తుడుచుకుంటూ....

"మరి నే వస్తా శీనూ.... పనుంది. నిన్నిలాకలుసుకోవటం నాకుసంతోషంగా వుంది. మళ్లీ ఎప్పుడయినా కలుస్తాను. వస్తాను మరి...." అంటూపేవ్మెంటుదిగి రోడ్డు దాటుకుంటూ అటువేపు వెళ్లిపోయాడు శేషు.

వెళుతున్న శేషుకేసి చూస్తూ కొన్ని క్షణాలు అలాగే నిలబడిపోయాడు శ్రీనివాస్.

సముద్రంలో అలల్లాగ చెలరేగుతున్నాయి అతని తలలో ఆలోచనలు.

'శేషు అదృష్టవంతుడు. చప్పున పుద్యోగం దొరికింది....'

ఆ మాట అనిపించిన మరుక్షణం ఛెళ్లున కొరడా దెబ్బ తగిలినట్లుగా పులిక్కిపడ్డాడు.

"ఆ అదృష్టం నీకూ పట్టాలని వుందా ...."అంతరాంతంరాలలోంచి, అట్టడుగు పొరల్లోంచి ఏమూలో దాగివున్న ఓ స్వరం....

"ఆ...." అన్నట్టు తలవూపబోయి, రెప్పపాటులో స్ఫురణ కలిగినట్టు తల విదిలించాడు.

"నో.... నో.... వద్దు.... అట్లాంటి అదృష్టం నా కొద్దు.... నే నలా కోరుకోటంలేదు.... లేదు..... లేదు........ తప్పుచేసినవాడిలాగా, తనలో మెదిలిన యీ ఆలోచన ఎవరికయినా తెలిసిపోతుందేమోనని భయపడుతున్న వాడిలాగా.... ఆ తలంపు మళ్లీ తనలో ఎక్కడ చోటుచేసుకుంటుందో నన్న భీతితో మనసును, దృష్టిని, ఆలోచనలను మనుషులమీదికి, షాపులమీదికి, రోడ్డు మీద తరుముకుపోతున్నట్టు పరుగులు తీస్తున్న వాహనాలమీదికి బలవంతంగా మళ్లిస్తూ చరచరా అడుగులు సాగదీశాడు యింటివేపు.

ఆ రాత్రి పక్కమీద పడుకుని శేషు మాటల్నే మననం చేసుకోసాగాడు. చప్పున ఒక ఆలోచన స్ఫురించింది.

'నాన్ననో మాట అడిగిచూస్తే.... ఆయన సవ్యంగా జవాబు చెబుతారా? ఏమయినా, అడిగిచూడాలి....'

ప్రక్కన సుజాత వచ్చి పడుకున్న అలికిడై యిటు తిరిగాడు. అప్పటికే కళ్లు మూసుకుని వుంది తను.

సుజాత వూరినుండి వచ్చాక తను సరిగ్గా చూడనేలేదు యీ యింటర్వ్యూ గొడవలో. కాస్త బొద్దుగా యింకొంచెం అందంగా కనబడింది.

"సుజాతా...." ప్రియంగా పిలుస్తూ మీద చేయివేశాడు.

"ఊ...." పైనపడిన చేతిని మెల్లిగా తీసేసి అటుతిరిగి పడుకుంది.

"ఏం కోపమొచ్చిందా దేవిగారికి" బలవంతంగా తనవైపు తిప్పుకోబోయాడు.

"అదొక్కటే తక్కువ నా ముఖానికి" విసురుగా వచ్చిన జవాబు. అలాంటి సమయంలో ఆ మాటలు యిదివరకెన్ని సార్లో దొర్లాయి. మామూలే.

"సరేలే. యిటు తిరుగు. నీ దయ లభించి చాలా రోజులయిపోయింది." గోముగా అడిగాడు.

"అవునవును. యీ దయ ఎప్పుడు పడితే అప్పుడు దొరుకుతుంది. కానీ ఖర్చులేకుండా, ఒకరి సిఫారసు అక్కర లేకుండా...."

చప్పున సుజాతమీదనుంచి చేతులు తీసేశాడు.

"అంటే...."

"ఏంలేదు. కానీ ఖర్చులేకుండా దొరికే సుఖంకదూ. యీ గదిలోకి వచ్చేసరికి మాత్రం మగవారని గుర్తుకొస్తుంది మీకు. దీనికి మాత్రం తయారు...."

"నోర్ముయ్" అనుకోనిచోటినుంచి అనుకోకుండా తగిలిన శరాఘాతం. కోపంతో పిడికిళ్లు బిగించాడు శ్రీనివాస్.

"ఇన్నాళ్లూ నోరుమూసుకునే వున్నాను ..."

"అంటే యిక నీవూ నోరుచేసుకుంటా వన్నమాట" కోపాన్ని పళ్లమధ్య బిగబట్టి అన్నాడు.

"కాకపోతే ఏమిటండీ? పెళ్లయి రెండేళ్లయింది. ఈ రెండేళ్లలో మీరు ఒక్కసారంటే, ఒక్కసారి.... ఒక్క పండక్కంటే, ఒక్క పండగకు మీ చేత్తో ఒక చీర కొనిచ్చారా? ఆరునెల్ల గర్భవతిని. నీ కేమయినా కావాలా అని ఒక్కసారి అడిగిచూశారా. చివరకు.... చివరకు.... ఒక్క రోజయినా ఒక్క పావలా పూలు..."

"అపు...." అని అరిచాడు శ్రీనివాస్.

వెక్కిళ్ళ మధ్య సుజాత గొంతు పూడుకుపోయింది.

కదిలిపోయాడు శ్రీనివాస్. అంతరంగ మధనంలో చెల్లాచెదరవుతున్న భావాలు. తనమీద తనకే అసహ్యం వేసింది. తన అసమర్ధతను తనే నిందించుకున్నాడు.

ఇన్నాళ్లూ యీ యిరుకు పరిస్థితుల మధ్య నలిగి, యీ ఈటెల్లాంటి మాటలకు, చాకుల్లాంటి చూపులకు గాయపడుతున్న మనసును ఎప్పటికప్పుడు సంభాళించుకుంటూ.... భవిష్యత్తుమీది ఆశతో రోజులు నెట్టుకొస్తున్నాడు. కాని.... కాని.... యీ రోజు సుజాత.... తన భార్య నోటివెంట ఎలాంటి మాటలు వచ్చాయి.

ఒక ఆడది మగవాణ్ణి ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడే కొట్టింది బాగా.... తనమీద కోపం తెచ్చుకుని ఏంలాభం. 'సుజాత గూడా ఒక మామూలు ఆడదే కదా.' ఎంతగా సర్దిచెప్పుకున్నా శ్రీనివాస్ హృదయం బాగా గాయపడింది. అతడి ఒళ్లు అవమానంతో దహించుకు పోతున్నట్టు అనిపించింది.

ఎంతో ప్రయత్నంమీద తనను తాను దిటవుపరచుకుని తండ్రిముందు నిలబడ్డాడు.

"ఊ.... ఏమిటి" పేపర్లోంచి తలెత్త కుండానే అడిగాడాయన.

యీ నిర్లక్ష్యానికి, యీ చిన్నచూపుకే ఒళ్లు మండుకొస్తుంది శ్రీనివాస్‌కు."

"మీ రిటైర్‌మెంటు కింకా ఎన్నాళ్లుంది" సూటిగా అడిగాడు శ్రీనివాస్.

చప్పున పేపరు దించి ఆశ్చర్యంగా తలెత్తి చూశాడాయన కొడుకువేపు.

"ఏం? నారిటైర్‌మెంటు గురించి ఆరా ఎందుకట యిపుడు."

"ఇక వుద్యోగం దొరుకుతుందన్న ఆశ పోయింది నాకు. ఎక్కడికి పోయినా సగంసీట్లు రిజర్వుడు కులాలు, మిగతా సగంలో కొన్ని వుత్తరానికి, కొన్ని దక్షిణానికి. యిన్నేళ్ల నా చదువు, శ్రమ, డబ్బు యిలా గంగలోపోసేసినట్టు...."

తను ఏదో అడగాలకుని వచ్చి మధ్య యీ మాటలతో బేలయిపోతున్నట్టు క్షణంలో గ్రహించుకున్నాడు శ్రీనివాస్.

"యింకో నాలుగు నెలల్లో గవర్నమెంటు వుద్యోగానికి వుండవలసిన వయఃపరిమితి దాటిపోతుంది నా వయసు. ఆలోగా వుద్యోగం దొరుకుతుందన్న ఆశలేదు. అందుకని.... అందుకని...."

"అందుకని.... అందుకని.... అంటూ నీళ్లు నములుతున్నావేమిటి. అనుకున్నది సరిగ్గా చెప్పలేవూ?" కొడుకేం చెప్పబోతున్నాడో ఆయన వూహకు అందటం లేదు. అందుకే ఆ నాన్పుడు భరించలేనట్టు అడిగాడు.

"మీరు వాలంటరీ రిటైరుమెంటు తీసుకుంటే నాకు వుద్యోగం యిస్తారు. మీ డిపార్టుమెంటులో పని...."

ఎవరో తరుముకువస్తున్నట్టుగా ఆ నాలుగు మాటలూ చెప్పేసి ముఖాన పట్టిన చెమట తుడుచుకున్నాడు శ్రీనివాస్.

కొన్ని క్షణాలు నోటమాటరానట్టుగా, ఈ మాటలన్నది శ్రీనివాసేనా అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు ఆయన.

"అంతేనా? నేను చచ్చిపోవాలని కూడా అనుకుంటున్నావా."

ఉలిక్కిపడ్డాడు శ్రీనివాస్.

"లేదు.... లేదు.... నేనలా అనుకోటంలేదు. మీరు వాలంటరీ రిటైరుమెంటు తీసుకుంటే చాలు...." కంగారుగా అన్నాడు శ్రీనివాస్.

"అంతవరకు అదృష్టవంతుడినే. తండ్రి చచ్చిపోతే కొడుక్కి వుద్యోగం యిస్తాం అనిమాత్రం రూలు వుండివుంటే 'నాన్నా! నీవు చావకూడదూ,' అనయినా అడిగేవాడివే నీవు. ఛీ.... ఛీ....

వుద్యోగం సంపాదించుకోలేని నీ అసమర్థతకు నన్ను వాడుకోవాలనుకుంటున్నావన్నమాట నో.... నెవర్. నాకు యింకో రెండు నెలల్లో ప్రమోషన్ వస్తుంది. అలాంటిది, నీకోసం నన్ను ముందుగానే రిటైర్ కమ్మంటావా? యిస్తే మహా నీకు యల్. డి. సి.గా యిచ్చేది. నీ ముష్టి నాలుగొందల జీతం యిల్లు గడుపుతుందా? నా చేతుల్లో వున్న వుద్యోగాన్ని నీ చేతికి యిచ్చేసి యిక నీ మోచేతినీళ్లు తాగుతూ.... నీ దయాదాక్షిణ్యాలకోసం పడిగాపులు పడుతూ... యివ్వలేను.... నీకు శక్తిసామర్థ్యాలుంటే సంపాదించుకో. అంతేగాని యిలాంటి తెలివితక్కువ ఆలోచనలు చెయ్యొద్దు.... ఇక నీవు వెళ్లొచ్చు" కోపంగా పేపరు చేతిలోకి తీసుకుని అందులోకి తలదూర్చేశాడాయన.

'నీవు వెళ్ళొచ్చు'నన్న చివరి పదం వినకనే వూహించి ముందే లేచిపోయాడు శ్రీనివాస్. రాత్రి భార్య ప్రవర్తన, పొద్దున్నే తండ్రి మాటలు, వీటికి తలవంచవలసిన తన పరిస్థితి, అసమర్థత.... శ్రీనివాస్ మనసు తలుపుసందులో పెట్టి నొక్కుతున్నట్లుగా నలిగిపోసాగింది.

ఇంకో నాలుగు నెలలు. ఆ తరువాత ఏ గవర్నమెంటు వుద్యోగానికీ తనకు అర్హత వుండదు. వయసు దాటిపోతుంది. ఇక ప్రయివేటు కంపెనీల వుద్యోగాలు అనుభవంగల వుద్యోగులకే పరిమితం. తనకు వుద్యోగమే లేంది అనుభవం ఎక్కడనుంచి వస్తుంది?

ఇలా ఎన్నాళ్లు.... ఎన్నేళ్లు.... ఇక ఎన్నోరోజులు యిలా మానహీనంగా, అభిమానాన్ని చంపుకుంటూ తను బ్రతకలేడు. అయినవాళ్ళ నిరసన, కాని వాళ్ళ హేళన తను యిక భరించలేడు.... లేడు.... లేడు. చచ్చిపోతే.... ఒళ్లు ఝల్లుమంది శ్రీనివాస్‌కి. చప్పున సుజాత కళ్ళముందు మెదిలింది. సుజాత రూపంతోపాటు యింకా యిప్పుడిప్పుడే రూపం దిద్దుంకుటూ యింక రెండు మూడు నెలల్లో యీ లోకంలోకి అడుగు పెట్టబోతున్న తన కన్న....

ఒళ్లు ఝల్లుమనిపించిన ఆ ఆలోచనను మళ్లీ మనసులోకి రానీయకూడదనుకున్నాడు. మరి.... మరి.... ఎలా?.... చిన్నాచితకా, కూలీ, రిక్షా.... నో.... నో.... తన ఎమ్. కామ్. డిగ్రీ అడ్డొస్తుంది. తను చేయలేడు. తనవల్ల కాదు..

తండ్రి ఎంత నిర్దయగా చెప్పేశాడు. అదే శేషు నాన్న.... కొడుకుకోసం, త్యాగం చేయబోయాడు. కాని.... ఆయన ఆశ తీరకుండానే.... అప్పటిదాకా రోడ్లన్నీ తిరిగిన అలసటతో యిక ఆలోచనలన్నీ మూటగట్టి కాళ్లీడ్చుకుంటూ యింటికి బయలుదేరాడు శ్రీనివాస్.

'ఇంటికి' అంటే భయంవేస్తోందీమధ్య అతడికి. నేరంచేసి జైలుకి వెడుతున్న వాడిలా కుచించుకపోతున్నాడు.

* * *

శ్రీనివాస్ భార్య సుజాతను కాన్పుకు తీసుకుపోయాడు శ్రీనివాస్ మామగారు. తీసుకెళ్ళటానికి వచ్చినపుడు ఆయన చూసిన చూపులు ఆనాడు వాళ్లింట్లో తను విన్న మాటల్ని రిపీట్‌చేసినట్లుగా అనిపించింది శ్రీనివాస్‌కి. సుజాత మాత్రం చిక్కిపోయి, కళ్లు గుంటలుపడిపోయి, నీరసంగా అవుపిస్తున్న భర్తను వదలలేక వదలలేక బయలుదేరింది కళ్ళనీళ్ళతో.

* * *

వయఃపరిమితి దాటిపోటానికున్న గడువు సమీపించింది శ్రీనివాస్‌కు. కనిపించిన వుద్యోగాలన్నిటికీ అప్లయ్ చేశాడు. అడ్డమయినవాడి కాళ్ళూ పట్టుకున్నాడు. అయినా యిప్పుడు కావలసింది కాళ్ళుపట్టడం కాదు. చేతులు తడపటం అని అతడికి తెలుసు. ఆ శక్తి తనకు లేదు. తన కళ్ళముందే తను తప్పకుండా వస్తుందని బాగా నమ్ముకున్న వుద్యోగాలన్నీ ఎవరెవరో తన్నుకుపోతున్నారు తమ సమర్థతతో. తను అసమర్థుడు.... ఒట్టి పనికిమాలినవాడు.... తను యిక యింతే.... యింతే.... యిలానే జీవచ్ఛవంలా....

చప్పున జేబులోంచి డిగ్రీ కాగితాలు తీసి పర్రున చింపేయబోయాడు. కాని మళ్లీ ఏదో చిన్న ఆశ.... మడిచి జేబులో పెట్టేసుకున్నాడు.

* * *

ఇంకొక్క నెల వుంది. శ్రీనివాస్ ఆశ అణగారిపోతూవుంది. రోజురోజుకీ కృశించిపోతోంది: యాంత్రికంగా తయారయ్యాడు.

సుజాత ప్రసవించింది. రమ్మని కబురొచ్చింది. తనకు వెళ్లాలని లేదు. అమ్మకు ఒంట్లో బాగాలేదు. తండ్రితోపాటు తప్పనిసరిగా బయలుదేరాల్సి వచ్చింది శ్రీనివాస్‌కి.

అక్కడ....

"బాబు ముద్దుగా వున్నాడు" అన్నాడు శ్రీనివాస్.

"మరి నాకు బహుమతేమిటి తెచ్చారు" సుజాత అంది నవ్వుతూ.

ఆ నవ్వు వంకరగా తోచినట్టు, ఆ మాట తనను దెప్పిపొడుస్తున్నట్టు చిన్నబోయాడు శ్రీనివాస్.

ఆ తరువాత అతనెవరితోనూ మాట్లాడలేదంతగా. కాని ఎన్నో మాటలు మాత్రం వినక తప్పలేదు.

"బాబు కేంతెచ్చావే బావ." మరదలు అడుగుతోంది.

"ఆ.... తెచ్చారు బళ్ళకొద్దీ.... మా ముఖాలకి ఆ మాత్రం కూడానా...."

"మీ ఆయనకి యిక వుద్యోగం రాదా" అత్తగారు.

"ఆయనకి వుద్యోగం రాకపోయినా దీనికి మళ్లీ కడుపుమాత్రం వస్తుంది." మామగారు నవ్వుతూ వ్యంగ్యంగా అంటున్నాడు.

"మీరేగా మేనల్లుడు, మేనల్లుడని యింతోటి సంబంధం యింకెక్కడా దొరకదని, కాళ్లూ కడుపూ పట్టుకుని చేశారు బోడిసంబంధం. ఒక వుద్యోగమా సంపాదనా, వల్లకాడా. పెళ్లానికి ఓ పూట పావలా పూలు తీసుకురాను గతిలేదు. యిక బిడ్డకి పాలడబ్బాలు, పక్కబట్టలూ కూడా వాళ్ల మామగారిని దేబిరించాల్సిందే యిది" ముక్కు చీదుకోంది అత్తగారు.

"మెల్లిగా మాట్లాడవే. ఆయన వింటారు" సణుగుతోంది సుజాత.

అంటే తను వింటాడేమోనని భయం తప్ప ఆ మాటలన్నిటికీ తన చెవులాలకిస్తూ తాళంవేస్తున్నట్టే కాదూ....

"ఏరా ! యిక వెళదామా...." అంటున్న తండ్రిని చూసేసరికి నసాళానికి అంటింది శ్రీనివాస్‌కు.

ఆ అరగంటలో.... యిక మంగళారతులన్నీ అయిపొయ్యాయిగా, బయలుదేరొచ్చునేమో" నన్న వ్యంగ్యం.... నిజంగా ఆయనలా అంటున్నాడా. లేక ప్రతిమాటా యిలావ్యంగ్యానికి హేళనకు అన్వయించుకునేందుకు అలవాటుపడిపోయిందా తనస్థితి.

ఉండమని ఎవరూ పెద్దగా బలవంత పెట్టలేదు.

పైకి కనపడని గాయాలు. ఒక్కొక్కరి మాటా చిత్రవధ చేస్తునట్టు గుర్తుకు వస్తున్నాయి. తన బాధను ఎవరర్థం చేసుకుంటారు. ఈ అవమానాలను ఎందరు అర్థంచేసుకుంటారు- బాధతోనో, కోపంతోనో, అసహనంతోనో, ఆవేదనతోనో శ్రీనివాస్ హృదయం కలతబారిపోయింది. మనసు రాటుదేలింది. నిర్దాక్షిణ్యంగా తనవాళ్ల విసిరి గాయపరుస్తున్న మాటల యీటెలు తనను బండబారిపోయేట్లు చేస్తున్నాయి.

శ్రీనివాస్ మౌనంగా తాము ఎక్కవలసిన రైలుముందు నుంచున్నాడు. తండ్రి టికెట్లకు వెళ్లాడు.

ఈ రైలు కదలగానే దీనికింద పడిపోతే....

'అయ్యో పాపం నిరుద్యోగి....' అంటారా జాలిపడి.

'అమ్మయ్య ! లక్షల నిరుద్యోగుల్లోంచి ఒకడు తప్పుకున్నాడు' అని తృప్తిపడతారా. తనకు మాత్రం యీ నిరంతర సంఘర్షణ, యీ వేదన తీరిపోతాయి. కాని.... కాని.... సుజాత.... లేతముఖం, బుల్లి బుల్లి చేతులు, పాదాలు ....తన చిన్ని బాబు.... తనకొచ్చిన పిరికి ఆలోచనకు తనను తనే నిందించుకున్నాడు.

ఏదీ చేయలేని అప్రయోజకుడు తను ...ఛీ.... ఛీఛీ....

అవునా.... నిజంగా తను ఏమీ చేయలేని అప్రయోజకుడా....

తండ్రిరావటంతో శ్రీనివాస్ అతడితో కలిసి రైలు ఎక్కాడు. అది దాదర్ ఎక్స్‌ప్రెస్.

* * *

దాదర్ ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌కు కొన్ని గజాల దూరంలోకి వచ్చేసింది. ప్లాట్‌ఫారం దగ్గరవుతోంది. దిగడానికి తయారయి తలుపు దగ్గరగా నిల్చున్నారు యిద్దరూ. 'అతడు' 'ఆయన.'

గుండెలమీద చెయ్యివేసుకుని ఒక నిశ్చయానికి వచ్చినట్టయి గట్టిగా కళ్లమూసుకున్నాడు అతడు. మరుక్షణం గాలిలోకి లేచిన ఆ చేయి....

* * *

చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతున్నాడు శ్రీనివాస్. తండ్రి ఆఫీసు నుంచి వుద్యోగంలో చేరమంటూ అతనికి వచ్చిన ఆర్డరు కాగితం గజగజలాడిపోతోంది అచేతుల్లో. శ్రీనివాస్‌కి అందులో అక్షరాలు కనిపించటంలేదు. తండ్రి.... తన తండ్రి.... నెత్తురోడుతున్న శరీరం.... ఆ శరీరంమీద కుప్పలా కూలిపోయిన తన తల్లి....'భగవాన్'... యిలా జరుగుతుందనుకోలేదు. కన్న తండ్రిని పొట్టన పెట్టుకుని తల్లి పసుపు కుంకుమలు తుడిచేయాలనుకునే కర్కోటకుడు కాదు తను.... కాని.... కాని...

వాలంటరీ రిటైరుమెంటుకు యిష్టపడని తన తండ్రి, ఏ అనారోగ్యమో వచ్చి మంచానపడని తండ్రి....యింక... కేవలం పాతికంటే పాతికరోజుల్లో మీరిపోయే తన వయసు.... ఈలోగా వుద్యోగం దొరకటానికి ఏ విధంగానూ ప్రయత్నించని....సాయపడని తండ్రి... తన ఆలోచనంతా వుద్యోగం సంపాదించటం ఎలా అనే. ప్రతి నిముషం తనని తినేస్తూ తనని జీవచ్ఛవంలా చేస్తున్న యీ ఆలోచన తనలోని విచక్షణను, వివేకాన్ని చంపేసిందా ? ఇందుకు కారణం తన అసమర్థతా....స్వార్థమా... తనను, తన పరిస్థితులను అర్థంచేసుకోకుండా క్షణక్షణం తనను అపహాస్యం చేసిన అయినవాళ్లా ? తన అవసరం గమనించలేని ప్రభుత్వాధికారులా....

తన కుద్యోగం దొరకాలంటే, అదీ ఆ పాతికరోజుల్లోగా వున్న ఒక్క మార్గమూ తన తండ్రే.... ఏదో అనుకున్నాడు. అన్నీ తనకు అనుకూలంగా జరగాలనీ ప్రార్థించాడు.... కాని....యీ దారుణం తను వూహించలేదు. కలలో కూడా తలచుకోలేదు. ఆ పైశాచికపు టాలోచన రావటానికి వూపిరి తిప్పుకోనివ్వని తన ఆలోచనలు, నలిపివేస్తున్న పరిస్థితులు కారణమయ్యాయి కాని ఒక్క క్షణం, ఆ పైశాచికపు క్షణాలు ఎలాగో చోటుచేసుకుని ఒక్కక్షణం

తను తల్లిని గురించి ఆలోచించ గలిగి వుంటే.... ఒక్క క్షణం ఆ తల్లి ముఖం తన కళ్ల ముందు కదిలాడివుంటే....

అంత ఘోరమైన వూహ తనకెలా వచ్చిందో.... దాన్ని వెంటనే అమలు పరచే శక్తి, ధైర్యం తనలో ఎలా వచ్చాయో....

రైలు వేగం తగ్గిపోయాక.... తీరా స్టేషన్ దగ్గరకు వచ్చాక.... ఆ చిన్న వూపుకు ప్లాట్‌ఫారంమీద పడి, ఏవో.. దెబ్బలు తగిలి, ఏ కాలో, చేయో కదిలించలేని పరిస్థితి వచ్చి... యిట్లా అనుకున్నాడే కాని.... యీ వూహయినా రావటం ఎంత మోరం.... ఆయనకి తను చేసిన ద్రోహానికి పరిహారంగా జీవితాంతం కంటికి రెప్పలా కాచుకోవాలనుకున్నాను. కాని.... ఆయన తన ద్రోహానికి అసహ్యించుకున్నాడు. అందుకే తనకా అవకాశం యివ్వకుండా పోయాడు! తగిలిన దెబ్బల మూలంగా మరణించలేదు. ఆ హఠాత్సంఘటన, రైల్లోంచి తను పడిపోతున్నాడన్న వూహ ఆయనకు 'షాక్' యిచ్చింది. ఆ షాక్‌తోనే ఆ గుండె ఆగిపోయింది. డాక్టరు చెప్పినప్పుడు.... తనకు జన్మనిచ్చిన తండ్రిని, తన జీవనోపాధి కోసం ఒక్కటంటే ఒక్క సెకండులో మృత్యువు నోటి కందిచ్చాడు తను అన్న దారుణమయిన నిజాన్ని భరించలేక గుండె పగిలపోతుందేమో ననిపించింది. ఏదయితేనేం.... తను తనకు, ఆ భగవంతుడికి తప్ప మరెవరికీ తెలియని హంతకుడు. తండ్రి చిందించిన రక్తంతో తడిసిన కూడు తన దోసిట్లోకి వచ్చింది. యిక తను నెత్తురుకూడే తింటాడు, యీ నెత్తురుకూడే తన తల్లికి, భార్యకు, తన బిడ్డలకు తినిపిస్తాడు.... ఓహ్.... భగవంతుడా.... ఈ బాధ నేను భరించలేను. ఈ నెత్తురుకూడు నేను తినలేను.... నో.... నో

.... ఐ కాంట్....



హృదయంలో సుళ్ళుతిరుగుతున్న భావాల ప్రకంపనలకి తట్టుకోలేక బైటికి వెలువడిన చివరి మాటలు వినిపించి సుజాత పరుగున హాల్లోకి వచ్చింది. ఒక్క క్షణం స్థాణువులా నిలబడిపోయినా.... ఒక్కంగలో భర్త చేతిలో నలిగిపోతూ యింకొక్క క్షణంలో చిరగబోతున్న ఆ అర్దరు కాగితాలను చప్పున లాక్కుంది.

స్పృహ తెచ్చుకున్నట్లయిన శ్రీనివాస్ పిచ్చివాడిలా సుజాతకేసి చూశాడు. ఆమె చంకలోని బాబును, ఆమె చేతుల్లో తను నలిపేసిన కాగితాల్ని చూశాడు.

“సుజాతా....సుజాతా.... నేను అసమర్థుడిని.... పాపిని.... నికృష్టుడిని. రేపటినుంచి నాన్న రక్తంతో తడిపిన మెతుకులు మింగే పిశాచిని....” అంటూ భార్య భుజాలమీద వాలి పిచ్చిగా రోదించసాగాడు.

———